క్లుప్తంగా

బండలాగుడు పోటీలు



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయం వద్ద గురువారం నుంచి ఎద్దుల బండలాగుడు పోటీలు ప్రారంభమయ్యాయి. గురు, శుక్రవారాల్లో గోపాల్‌పేట మండల స్థాయి బండలాగుడు పోటీలు, ఆ తర్వాత సీనియర్, న్యూ కేటగిరి, పాలపళ్ల సైజ్ పోటీలు, ఈనెల 30న ట్రాక్టర్ రివర్స్‌గేర్ మండల స్థాయి పోటీలు జరగనున్నాయి. పోటీలను గురువారం ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి ప్రారంభించారు. బండలాగు పోటీలను చూసేందుకు మండల ప్రజలు తరలివచ్చారు.

ఆర్థికసాయం అందజేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని గట్లఖానాపూర్ గ్రామానికి చెందిన వాకిటి బుచ్చన్న(55) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తక్షణ సాయం కింద రూ.5వేలు పంపించాడు. కాంగ్రెస్ నాయకులు గురువారం బాధితుడి ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో దామోదర్, వెంకటేష్, వెంకటయ్య, శేఖర్, మహేష్, చుక్క దామోదర్, దేవిగౌడ్, వెంకట్రాములు తదితరులు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని లక్ష్మి గురువారం మృతి చెందారు. స్థానిక నాయకులు విషయాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన రూ.5 వేల ఆర్థికసాయం పంపించారు. నగదును కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరిరాజు, స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

బీజేపీ పాలనలో ఆర్థిక అసమానతలు



పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు అధ్యక్షతన గురువారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ ప్రపంచ కార్మిక దినోత్సవం అయిన మే డే వనపర్తి జిల్లాతో పాటు అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో మే 1న ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గంధం మదన్, వెంకటయ్య, ఊశన్న, బాలగౌడ్, గంధం రవి తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద పార్టీలను ఓడిద్దాం: సీపీఎం



కొత్తకోట రూరల్: ప్రజా సమస్యలను గాలికొదిలి మతోన్మాదంతో గద్దెనెక్కాలని చూస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిద్దామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. గురువారం కొత్తకోటలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జబ్బార్‌తో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మత విద్వేషాలు రెచ్చగొడుతూ మూడోసారి అధికారంలోకి రావాలని ఆ పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. దళిత, గిరిజన, ఆదివాసి, మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేస్తామంటూ కులమతాల చిచ్చు పెట్టి ఓట్లను కొల్లగొట్టేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. భువనగిరి పార్లమెంట్ స్థానంలో సీపీఎం ఒంటరిగా బరిలో నిలిచిందని.. మిగిలిన 16 స్థానాల్లో ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్, బి.వెంకటేష్, ఆర్ఎన్ రమేష్, ఎస్ అజయ్ తదితరులు ఉన్నారు.

దాడి కేసులో డీఎస్పీ విచారణ

ఆత్మకూర్: పట్టణంలోని బీసీకాలనీలో పరస్పర దాడులకు పాల్పడిన ఇరువర్గాలపై కేసులు నమోదయిన నేపథ్యంలో వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు గురువారం విచారణ చేపట్టినట్లు సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ తెలిపారు. నాలుగు రోజుల క్రితం రేవల్లి శ్రీను, అదే కాలనీకి చెందిన గడ్డమీది శ్రీనివాసులు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గడ్డమీది శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కావడంతో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. తనను కులంపేరుతో దూషించాడని రేవల్లి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు, దాడి ఘటనలో గడ్డమీది శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదులపై కాలనీలో డీఎస్పీ విచారణ చేపట్టారని, కేసులకు సంబంధించి పూర్తి వివరాలను తెలుపుతామని సీఐ తెలిపారు.

ప్రాధాన్యం దేనికిస్తారో..?

- ప్రభుత్వ మార్పు తర్వాత రెండో జిల్లా పరిషత్ సమావేశం
- ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రి హాజరవుతారా.. ?
- తాగునీటి సరఫరాపై చర్చకు అవకాశం
- గత సమావేశానికి వనపర్తి ఎమ్మెల్యే మినహా.. మిగతా వారు డుమ్మా



వనపర్తి జిల్లా పరిషత్ కార్యాలయం

వనపర్తి: పార్లమెంట్ ఎన్నికల ప్రచారం జోరుగా జరుగుతున్న సమయంలో జిల్లా ఎన్నికల అధికారి తేజస్‌పవార్ అనుమతితో అత్యవసరమైన తాగునీరు, పెరిగిన ఉష్ణోగ్రతలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇతర అంశాలపై శుక్రవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. జిల్లాల విభజన తర్వాత ఎమ్మెల్యేలు జెడ్పీ సమావేశాలకు అనాసక్తి ప్రదర్శించటం పరిపాటిగా మారింది. ప్రభుత్వం మారిన తర్వాత నిర్వహిస్తున్న రెండో జిల్లా పరిషత్ సమావేశానికైనా.. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రి హాజరవుతారా అని ప్రజలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు చర్చించుకుంటున్నారు. 2024 జనవరి 9న నిర్వహించిన సమావేశానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మినహా మరే ఇతర ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రి హాజరుకాలేదు. ప్రస్తుతం ఎన్నికల హడావిడి నేపథ్యంలో స్పందన ఎలా ఉంటుందో చూడాల్సిందే. ప్రజాప్రతినిధులుగా రాజకీయ ప్రయోజనాలా.. లేక ప్రజాప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తారా..? అనే చర్చ నడుస్తోంది. జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి అనుమతితో నిర్వహించే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డితో పాటు ఇద్దరు ఎంపీలు పోతుగంటి రాములు, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరిలకు అధికారులు ఆహ్వాన లేఖలు పంపించారు. మరికొందరికి జెడ్పీ చైర్మన్ ఫోన్ చేసిన సమావేశానికి రావాల్సిందిగా కోరినట్లు తెలిసింది.

ప్రగతి నివేదిక చర్చ జరిగేనా..

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం అనగానే గత సమావేశంలో చర్చించిన అంశాల్లో, శాఖల వారీగా పురోగతి, అభివృద్ధి పథకాల అమలు, సమస్యలు, చేయాల్సిన పనులు, నిధుల కేటాయింపులు, వెచ్చించిన నిధులపై చర్చించటంతో పాటు ఆయా మండలాల్లోని సమస్యలపై జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు జిల్లా పాలకవర్గంతో చర్చించాల్సి ఉంటుంది. కానీ ఎన్నికల సమయం కావటంతో అత్యవసరమైన అంశాలను ప్రస్తావించేందుకు జిల్లా ఎన్నికల అధికారి అనుమతితో నిర్వహిస్తున్న ఈ సమావేశంలో శాఖల వారీగా ప్రగతి నివేదికలు, అభివృద్ధి పనులపై చర్చ నిర్వహిస్తారా అనేది తెలియాల్సి ఉంది.

> **తీర్మానాల్లేవ్**
>
> పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోడ్‌అమల్లో ఉన్న కారణంగా కొత్తగా ఎలాంటి తీర్మాణాలు చేసేందుకు అవకాశం లేదు. జిల్లా ప్రజలకు వేసవి దాటే వరకు తాగునీటి సమస్య ఉత్పన్నం కానివ్వకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించటంతో పాటు పెరిగిన ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలకు సూచనలు, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణపై సమావేశం కొనసాగుతుంది.
>
> – జెడ్పీ సీఈఓ యాదయ్య

108 కలశాలతో స్వామివారికి పాలాభిషేకం



108 కలశాల ఊరేగింపు చేస్తున్న అర్చకులు

ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురం గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహ యోగానంద స్వామి వారి 125వ ఆరాధన సహిత సప్తాహ మహోత్సవాల్లో భాగంగా ఆలయం ఆవరణలో గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో 108 కళశాలతో క్షీరాబిషేకం మహోత్సవం నిర్వహించారు. మేళతాళాలతో గ్రామంలో కళశాలతో ఊరేగింపు చేశారు. బుధవారం రాత్రి ఆలయం ప్రాంగణంలో లక్షదీపారాధన చేపట్టారు. ఈ నెల 19న ప్రారంభమైన ఉత్సవాలు 30న ముగుస్తాయని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారికి పూజలు చేయడంతో పాటు దీపారాధన చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా గురువారం ఉదయం నుంచి స్వామివారికి పూజలు నిర్వహించారు.

డ్రెయినేజీ, సీసీ రోడ్లు వేయరూ..



సీసీ రోడ్డు, డ్రెయినేజీ లేకపోవడంతో రోడ్డుపైకి వచ్చిన మురుగు

కొత్తకోట రూరల్: మండలంలోని రాయిణిపేటలో 15ఏళ్ల కిందట ఏర్పడిన షిరిడి సాయి కాలనీలో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా నేటికీ మౌలిక సదుపాయాలైన సీసీ రోడ్లు, డ్రెయినేజీలు వంటివి లేక కాలనీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎండకాలం ఇలా ఉంటే వానాకాలం పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని, దోమల వలన అనారోగ్యానికి గురై ఆస్పత్రుల పాలైన ఘటనలు ఉన్నాయని వాపోయారు. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో కాలనీ అభివృద్ధికి నోచుకవడం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. అధికారుల, ప్రజాప్రతినిధుల పనితీరుపై కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకు గెలిచిన సర్పంచ్‌లు సైతం పట్టించుకోలేదని, ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుందని, వారైనా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ముఖ్యం



మాట్లాడుతున్న ఏఎస్పీ రామదాసుతేజావత్

పెబ్బేరు రూరల్: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఏఎస్పీ రామదాసుతేజావత్ అన్నారు. ఎస్పీ రక్షిత కే మూర్తి ఆదేశాల మేరకు ఏఎస్పీ ఆధ్వర్యంలో వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జంగాలగుట్ట ఏరియాలో గురువారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 40 మంది పోలీస్ సిబ్బందితో తనిఖీలు చేశామన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ కాలనీల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరించడం, నేరస్తులు వచ్చి షెల్టర్ తీసుకుంటున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల రక్షణ, భద్రతా భావం సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ కల్పించడం, ప్రజల యొక్క సమస్యలను నేరుగా తెలుసుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అనుమతి పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 23 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరావు, సీఐ నాగభూషణం, వనపర్తి, కొత్తకోట సర్కిల్ ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుల్స్, హోంగార్డులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలకు కృషి



పాన్‌గల్‌లో మలేరియా నివారణ అవగాహన ర్యాలీ చేస్తున్న సిబ్బంది



ఆత్మకూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఆత్మకూర్: దోమల నివారణే లక్ష్యంగా ప్రతిఒక్కరూ ముందుకెళ్లాలని, 'దోమల అంతం.. మనందరి పంతమని', 'దోమలు పుట్టరాదు.. దోమలు కుట్టరాదని' అనే స్లోగన్స్‌తో తిప్పడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శరత్‌కుమార్, వైద్యులు వసంత, నిస్సార్‌అహ్మద్, సురేష్‌కుమార్ అవగాహన కల్పించారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆత్మకూర్‌లో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, వైద్యసిబ్బంది ఉన్నారు.

పాన్‌గల్: మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పాన్‌గల్‌లో అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు నాగరాజు, శ్రీకాంత్, వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్, మదన్‌మోహన్, సంతోషమ్మ, సుమనశ్రీ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మలేరియాతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ నర్సింహులు, పీహెచ్ఎన్ కామాక్షి, ఎంపీహెచ్‌సీ శ్రీనివాసులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో వైద్య బృందంచే పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వినీలా రాణి, సీహెచ్‌ఓ జ్యోతి, హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, వెంకటసుబ్బమ్మ, హెల్త్ అసిస్టెంట్లు రాజశేఖర్, తిరుపతయ్య, ఏఎన్ఎంలు వెంకటమ్మ, జయశ్రీ, మౌనిక, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కనులపండువగా మునిరంగస్వామి జాతర



ఆలయ ఆవరణంలో పోటేళ్లను బలిస్తున్న భక్తులు

అమరచింత: చింతల మునిరంగస్వామి పాహిమాం .. పాహిమాం అంటూ వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు తమ తమ మొక్కులను తీర్చుకున్నారు. మండలంలోని నందిమళ్లలో వెలసిన చింతల మునిరంగస్వామి జాతర గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తులు స్వామివారికి పోటేళ్లను బలిచ్చి కందూర్‌లు నిర్వహించగా, మరికొందరు తీపి వంటకాలతో నైవేద్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పించుకున్నారు. మూడు రోజుల పాటు జరిగే జాతరకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జాతరకు వచ్చిన భక్తులు మాత్రం తాగునీటి ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అలయ ఆవరణంలో తినుబండారాలు, బొమ్మల దుకాణాలు వెలిశాయి. గురువారం రాత్రి 11:15 నిమిషాలకు ప్రభోత్సవం, శుక్రవారం రాత్రి 1 గంటలకు ప్రభోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. జాతర సందర్భంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ, కుస్తీ పోటీలను నిర్వహిస్తున్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

పాన్‌గల్: ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్యను ప్రతి జీపీలో రోజుకు 200 మందికి తగ్గకుండా వచ్చేలా చూడాలని ఏపీఓ కుర్మయ్య సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని దావాజిపల్లిలో ముందరి చెరువులో ఒండ్రు మట్టి తరలింపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనుల్లో రైతులకు ఉపయోగపడే పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సాగునీటి కాల్వలు, చెరువులో పూడికతీత, కుంట కట్టల వంటి మరమ్మతు పనులను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తీవ్రమైన ఎండలతో ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉండాలని, పనులకు ఉదయం వేళల్లో తొందరగా వెళ్లి మధ్యాహ్నం త్వరగా వచ్చేలా చూడాలని ఆయన సిబ్బందికి సూచించారు. పనుల వద్ద కూలీలకు ఇబ్బందులు కలుగకుండా నీడ, నీటి వసతి తప్పక ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

కూలి రేట్లు..

గోపాల్‌పేట: ఉపాధి కూలీలు ఎండలకు తట్టుకోలేక పోతున్నారని వారికి కనీసం రోజుకు రూ.ఆరు వందల కూలి చెల్లించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. గురువారం ఆయన మండలంలోని ధర్మతండా, పాటిగడ్డతండా, చెన్నూరు గ్రామాల పరిధిలో జరుగుతున్న ఉపాధి కూలీల క్షేత్రాలను సందర్శించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 44 డిగ్రీల ఉష్ణోగ్రతలో కనీసం నాలుగు గంటలు పనిచేయాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోజుకు రూ.మూడు వందల కూలి ఇస్తున్నామని అధికారులు చెబుతున్నా.. ప్రస్తుతం వారికి రోజుకు రూ.వంద మాత్రమే పడుతోందన్నారు. వేసవి అలవెన్స్‌లు ప్రకటించాలని, గంప, పార, గడ్డపారలకు రోజువారీగా రూ.ఇరవై చొప్పున అందించాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో రాజేందర్, టీక్యా, దేవమ్మ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



కాశీంనగర్‌లో మాట్లాడుతున్న గట్టుయాదవ్



ఖిల్లాఘనపురంలో..

పెబ్బేరు రూరల్: అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ కోరారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ఆయన స్థానిక నాయకులతో కలిసి గురువారం వనపర్తి మండలంలోని కాశీంనగర్, నాగమ్మతండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఉపాధి పనుల వద్ద కూలీలను ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మాణిక్యం, రఘువర్ధన్‌రెడ్డి, దేవర్ల నరసింహ్మ, చిట్యాల రాము, నరసింహ్మ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: అబద్ధాలు, మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆటకట్టిద్దామని ఎంపీపీ కృష్ణానాయక్, మండల ఇన్‌చార్జ్ నందిమల్ల అశోక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఖిల్లాఘనపురంలో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, బుచ్చిబాబుగౌడ్, శంకర్, మన్నెం, చిన్న అంజనేయులుగౌడ్, మహేష్, చింతల శేఖర్, చిన్న చెన్నయ్య, కురుమయ్య ఉన్నారు.

వీపనగండ్ల: ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాబోయే ఎంపీ ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెప్పాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్, ఎంపీ ఎన్నికల ఇన్‌చార్జ్ ఆంజనేయులుగౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్‌రావు, మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ రామన్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



ఆత్మకూర్: బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం రాత్రి ఆత్మకూర్ మున్సిపాలిటీకి చెందిన బీజేపీ కౌన్సిలర్ మాదిరెడ్డి నాగలక్ష్మీరెడ్డితో పాటు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, పిన్నంచర్ల, ఆత్మకూర్‌కు చెందిన మరో 50 మంది ముఖ్య నాయకులు బీజేపీని వీడారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి, మాజీఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్రనాయకుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

జేఈఈలో 88 ర్యాంక్

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు ఫరీద్‌పాష రజియాసుల్తానా దంపతుల కుమారుడు రేహన్ గురువారం వెలుబడిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఆల్‌ఇండియా లెవల్లో 88వ ర్యాంక్, ఓబీసీ కేటగిరిలో 15వ ర్యాంక్ సాధించాడు.

బాలిక పెళ్లికి ఏర్పాట్లు

- తల్లిదండ్రులపై కేసు నమోదు

గోపాల్‌పేట: పదహారేళ్ల మైనర్ అమ్మాయికి పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు ఏర్పాట్లు చేయగా.. విషయం తెలుసుకున్న అధికారులు వారిపై కేసు నమోదు చేశారు. రేవల్లి ఎస్ఐ తిరుపతిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని కేశంపేట పాతతండాకు చెందిన 16 ఏళ్ల బాలికకు తల్లిదండ్రులు అదే గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువకుడికి ఇచ్చి పెళ్లి చేస్తుండగా విషయం తెలుసుకున్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులు గురువారం ఉదయం కేశంపేట పాతతండాకు చేరుకుని పెళ్లిని అడ్డుకున్నారు. అమ్మాయిని అదుపులోకి తీసుకుని బాలసదన్‌కు తరలించారు. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు పెళ్లి చేసేందుకు ప్రయత్నించిన అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

గోపాల్‌పేట: ఉరేసుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తిర్మలాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కురుమూర్తి (35) కూలీపని చేసుకుని జీవనం సాగిస్తుండేవావాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసై ఇంట్లో గొడవపడుతుండేవాడు. ఈ తరుణంలో మరోమారు గురువారం గొడవపడడంతో పాటు ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి చీరతో ఉరేసుకున్నాడు. బయటికి వెళ్లిన భార్య ఇంటికి వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. భార్య రేవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

న్యాయం చేయాలంటూ ఎస్పీకి మహిళ ఫిర్యాదు



కుమార్తెతో లీల(రిజ్వానా)

కొత్తకోట రూరల్: తనను మోసం చేసి పెళ్లి చేసుకుని, ఓ బిడ్డకు తల్లిని చేసి, మరో మహిళను పెళ్లి చేసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకుని తనకు, తన బిడ్డకు న్యాయం చేయాలంటూ ఓ మహిళ ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తకోట మండలంలోని మిరాసిపల్లికి చెందిన టి. నీల(రిజ్వాన), అదే గ్రామానికి చెందిన బాష కొంత కాలంగా ప్రేమించుకున్నారు. నీల, బాష ఇద్దరివి వేర్వేరు మతాలు అయినప్పటికీ పెద్దల సమక్షంలో మాట్లాడి ముస్లిం సాంప్రదాయం ప్రకారం పెళ్లి జరిపించారు. కొంత కాలం వీరి సంసారం సాఫీగా సాగింది. వీరికి ఐదు నెలల పాప ఉంది. ఈ నెల 14న బాష సమీప బంధువుల అమ్మాయితో రెండో వివాహం చేసుకున్నాడు. ఇన్ని రోజులు ఎక్కడికి వెళ్లావని బాషను లీల నిలదీయగా.. అసలు విషయం బయటపడింది. దీంతో లీల తనకు, తన కుమార్తెకు అన్యాయం చేశాడని తన భర్త తనకు కావాలని గురువారం ఉదయం ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసింది. అక్కడి నుంచి సాయంత్రం కొత్తకోట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలియజేశారు.

చెక్‌పోస్టుల వద్ద నగదు పట్టివేత

అమరచింత: జిల్లా సరిహద్దులోని నాగల్‌కడ్మూర్ చెక్‌పోస్టు వద్ద గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా మహ్మద్ రఫీ నుంచి రూ.59,500ల నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు. ఆత్మకూర్ నుంచి మక్తల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న రఫీ వద్ద నగదుకు వీటికి సంబంధించిన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసి నారాయణపేట గ్రీవెన్ సెల్‌కు పంపామన్నారు.

25 లీటర్ల మద్యం స్వాధీనం

మస్తీపురం క్రాస్ రోడ్ వద్ద ఎస్ఎస్‌టీ టీం సభ్యులు తనిఖీలు నిర్వహిస్తుండగా నందిమళ్లకు చెందిన చిన్న లచ్చన్న నుంచి అక్రమంగా తరలిస్తున్న 25 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు టీం కోఆర్డినేటర్ డీఈ నారాయణ తెలిపారు. పట్టుబడిన మద్యాన్ని ఎస్ఐ సురేష్‌కుమార్‌కు అప్పగించారు. తనిఖీలో ఏఎస్ఐ బాలకిష్టన్న, సిబ్బంది పర్వతాలు ఉన్నారు.

ఖిల్లాఘనపురం: అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి నుంచి మద్యం పట్టుకుని కేసు నమోదు చేశామని ఏఎస్ఐ సత్యంగౌడ్ తెలిపారు. ఖిల్లాఘనపురం మండలంలోని మానాజీపేటకు చెందిన గాజులపేట వెంకటయ్య మద్యం విక్రయిస్తున్నట్లు గురువారం సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీలో రూ.12,500 విలువ చేసే 12 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని, వెంకటయ్యపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

రూ.52,500 స్వాధీనం

గోపాల్‌పేట: బుద్దారం గండి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద గురువారం రూ.52,500 పట్టుకుని సీజ్ చేశామని గోపాల్‌పేట ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. వనపర్తికి చెందిన రాములు బిజినేపల్లి నుంచి వనపర్తికి సుమోలో వెళ్తుండగా వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా నగదు కనిపించిందని పేర్కొన్నారు. వాటికి సంబంధించిన పత్రాలు చూపకపోవడంతో డబ్బులు సీజ్ చేశామని ఎస్ఐ వివరించారు.


తాగునీటికి 20 క్యూసెక్కులు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం రోజురోజుకూ తగ్గుతోంది. గురువారం 1,012 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

మాలల అభ్యున్నతికి కృషి

అమరచింత: పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో గురువారం మాల వీధిలో మాల జనసంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా వెంకట్రాములు, ఉపాధ్యక్షులుగా రాములు, విష్ణువర్ధన్, సహాయ కార్యదర్శులుగా నరేష్, శేఖర్, భార్గవ్, కోశాధికారిగా రామస్వామితో పాటు మరో 11 మందిని కమిటీ సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ మాలల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు.

మోదీ సారథ్యంలో దేశంలో సుస్థిర పాలన



మదనాపురం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తే దేశంలో సుస్థిర పాలన కొనసాగుతుందని, ప్రతి ఒక్కరూ ఎంపీగా బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి కోరారు. గురువారం దంతనూరులో బీజేపీ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా దేశానికి పీఎం చేసిన అభివృద్ధిని వివరించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు తీవ్రంగా నష్టపోయారని దుయ్యబట్టారు.

ఆత్మకూర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి దేశాభివృద్ధికి తోడ్పాటునివ్వాలని, మోదీతోనే అవినీతి రహిత పాలన కొనసాగుతుందని మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మూలమళ్లలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భగవంతురెడ్డి, అంజి, శివ, రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.